www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 20 | జనవరి | 2025
పేజీలు 8

## ప్రమాదహరిత పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుదాం

- రోడ్డు భద్రత వారోత్సవాల సభలో ఎంఎల్ఏ కూనంనేని



7లో

# ఎవరి వ్యూహం ఈ ప్రకటన





-దామోదర్ ఉన్నట్టా...? మరణించినట్టా..?
-ప్రశ్నార్ధకంగా మావోయిస్టుల భవితవ్యం

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సజీవంగా ఉన్నారా లేక ఎన్‌కౌంటర్‌లో మరణించారా అన్నదానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ఈనెల 26న ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు అలియాస్ దామోదర్ మరణించినట్లు మావోయిస్టు దక్షిణ బస్తార్ ఏరియా కార్యదర్శి గంగ పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. ఈ ప్రకటనను మావోయిస్టులే విడుదల చేశారా లేక పోలీసులు వ్యూహాత్మకంగా ఈ ప్రకటన వచ్చేలా చేశారా అన్నది అంతు చిక్కడం లేదు. రూ. 75 లక్షల రివార్డు కలిగిన తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శి దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఒక చిన్న ప్రకటన చేసి మావోయిస్టులు చేతులు దులుపుకుంటారా ఒకవేళ దామోదర్ మరణిస్తే అతని మృతదేహం ఏమైంది మావోయిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పోలీసులే ఈ ప్రకటన విడుదల చేయించారా అన్న చర్చ సాగుతుంది. మరో పక్క ఒక వేళ ఈ ప్రకటన గంగ ఇచ్చింది నిజమైతే ఎన్‌కౌంటర్‌లో మరణించకుండానే మరణించినట్లు చెప్పడం వెనక మావోయిస్టుల వ్యూహం ఏమైనా ఉన్నదా అన్న దానిపై కూడా చర్చ సాగుతుంది. ఎందుకంటే గతంలో ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు ఇటువంటి ప్రకటనలు అనేకం రావడం వాటిలో కొన్ని నిజాలు లేకపోవడం జరిగింది. మావోయిస్టు అగ్రనేతలకు సంబంధించి పలుమార్లు పొరబడిన సందర్భాలు ఉన్నాయి. చొక్కారావు అలియాస్ దామోదర్ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కల్వపల్లి గ్రామానికి చెందిన వారు. ఈ కుటుంబానికి చెందిన ముగ్గురు మావోయిస్టు ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. బడే నాగేశ్వర రావు, బడే మురళి కూడా మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ

మిగతా 2లో..

## భారీ నష్టానికి బాధ్యులెవరు..?



-కాంట్రాక్టరా..? లేక అధికారులా...?
-అధికారుల నిర్లక్ష్యమే ఇంతవరకు తెచ్చిందా...?
-రూ.400 కోట్ల ప్రాజెక్ట్ మూన్నాళ్ల ముచ్చటేనా..?
-అంబేద్కర్ నగర్ వాసుల ఉసురు సైలో బంకర్‌కి తగిలిందా..?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి సిగలో జరుగుతున్న భారీ నష్టానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు ప్రజా సంఘాల నాయకులు. రూ. 400 కోట్లతో కిష్టారం శివారులోని అంబేద్కర్ నగర్ ఎదురుగా నిర్మించిన సైలో బంకర్ రోజు, రోజుకు బీటలు వారి కృంగిపోతుండడం అధికారులకు నిద్రలేకుండా చేస్తుంది. ఇంత భారీ స్థాయిలో నిర్మించిన ప్రాజెక్టు

మిగతా 2లో..

## గ్రామ సభల్లోనే లబ్ధిదారుల ఎంపిక



-పర్యాటక ప్రాంతంగా ఎర్రుపాలెం
-మరో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు
-ఎర్రుపాలెం మండల పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/ఖమ్మం/ఎర్రుపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక గ్రామసభల్లోనే జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,

మిగతా 2లో..

# ఎవరి వ్యూహం ఈ ప్రకటన

**(మొదటిపేజీ తరువాయి)**

ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. దామోదర్ అత్యంత చురుకైన నాయకుడిగా పేరుతెచ్చుకున్నాడు. గతంలో కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఏరియా కార్యదర్శిగా ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, పెద్దపల్లి ఏరియా మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. దాడులకు వ్యూహం పన్నడంలో సిద్ధ హస్తునిగా పేరున్న దామోదర్ 2024 జనవరి 10న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హరిభూషణ్ మృతి తర్వాత చొక్కారావుకు ఈ బాధ్యతను అప్పగించారు. సాయుధ బలగాలు పన్నిన వ్యూహంలో చిక్కుకుని మావోయిస్టులు విలవిలలాడుతున్నారు. ఒకప్పుడు దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు నేతలు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారు. మావోయిస్టుల వ్యూహం ఫలించడం లేదు. ప్రస్తుత సాయుధ బలగాల దూకుడు చూస్తుంటే మావోయిస్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. లొంగిపోవటాలు తప్ప సాయుధ దళాలలోకి దాదాపు రిక్రూట్‌మెంట్ నిలిచిపోయింది. అటవీ సమీప గ్రామాల్లో మావోయిస్టులకు నమ్మకమైన రక్షణ దొరికేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అటవీ సమీప గ్రామాల్లో పోలీసులు తిష్టవేసి మావోయిస్టుల సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారు. భారతదేశ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువుగా సాగిన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం ఇప్పుడు పోలీస్ బూట్ల చప్పుళ్లతో దడదడలాడుతున్నది.వేలాది మంది సాయుధ పోలీసులు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. 2026 నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని లేకుండా చేస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాటలకు అనుగుణంగా సాయుధ బలగాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. మావోయిస్టు ఉద్యమంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన వారిలో ఎక్కువ మంది తెలంగాణ వారే. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం ఇటీవల కాలంలో అంతగా ప్రభావితం చేయకున్నా నాయకత్వం మాత్రం ఇక్కడి నుంచే ఉండడం గమనార్హం. అంకితభావం కలిగి ఉద్యమంపై పట్టు బిగించి పోలీస్ బలగాలను ముప్పు తిప్పలు పెట్టి మూడు దశాబ్దాలుగా సాయుధ పోరాటాన్ని నడిపించిన వారిలో తెలంగాణ నేతలే ఎక్కువగా ఉన్నారు. మహత్తర చరిత్ర కలిగిన సాయుధ పోరాట మహోద్యమం ఇప్పుడు సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. ఇటువంటి స్థితిలో చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా మరణిస్తే మావోయిస్టు ఉద్యమానికి తీరని దెబ్బ. తెలంగాణ అబూజ్‌మడ్‌గా చెప్పుకునే కాల్వపల్లి బిడ్డ దామోదర్. యుద్ధతంత్ర నిపుణుడిగా పేరొందిన ఆయన ఎన్‌కౌంటర్ పట్ల వస్తున్న ఈ ప్రకటన అటు పోలీసుల్లోనూ, ఇటు మావోయిస్టుల్లోనూ కలకలం రేపుతుంది. బస్తార్ పోలీసులు మాత్రం ఇంత వరకు దామోదర్ మృతిని నిర్ధారించక పోవడం గమనార్హం.

# భారీ నష్టానికి బాధ్యులెవరు..?

**(మొదటిపేజీ తరువాయి)**



మూణాళ్ళ ముచ్చటగా మిగిలిపోవటానికి ఇంకా ఎంతో కాలం పట్టదని కార్మిక సం ఘాల నాయకులు వాపోతున్నారు. 8 నెలల క్రితం రెండవ బంకర్ కృంగిన అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో బాలాజీ నేడు మూడో బంకర్ కూడా కృంగిపోవడంతో ప్రజా సంఘాల నాయకులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక్కొక్క బంకర్ ఎనిమిది వేల టన్నుల సామర్థ్యంతో మూడు బంకర్లను గతంలో సమంత కంపెనీ నిర్మించింది. కంపెనీ నిర్మించిన నాడే కొన్ని హెచ్చరికలు సైతం అధికారులకు జారీ చేసిందని కార్మిక సంఘాలు తెలుపుతున్నాయి. 24 వేల టన్నుల సామర్థ్యం కలిగిన బంకర్‌లలో బొగ్గును పూర్తిగా తీయకూడదని, సుమారు 20 ఎం.ఎం నుండి 30 ఎం.ఎం అనగా కేజీ నుండి కేజీన్నర బొగ్గు పెల్లలు మాత్రమే రావాలనేలా మరి కొన్ని సూచనలు చేసిన్నప్పటికీ అధికారులు వారి సూచనలను పెడచెవిన పెట్టి బంకర్లను పూర్తిగా ఖాళీ చేయ్యటమే కాకుండా, సుమారు ఐదు నుండి 6 కేజీల బొగ్గు పెల్లలను బంకర్‌లలో నిల్వ చేసే వారని, సుమారు పది అడుగుల ఎత్తు నుంచి అంత బరువు గల బొగ్గు పెల్లలు పడతుండడంతో బంకర్ బీటలు వారిందని, ఆనాడు గమనించిన అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోకపోగా, అత్యుత్సాహం ప్రదర్శించటంతో నేడు పూర్తిగా బంకర్ ను మూసి వేసే పరిస్థితి నెలకొందన్నారు. షిఫ్ట్ కు రెండు వ్యాగన్ల బొగ్గు చొప్పున, మూడు షిఫ్టులకు 6 వ్యాగన్ల బొగ్గు పోవాల్సి ఉండగా అధికారులు కొందరి మెప్పు కోసం 9 వ్యాగన్ల బొగ్గును లోడింగ్ కి పంపేవారని దీంతో బంకర్లు పూర్తిగా ఖాళీ అయ్యేవని అనంతరం వాటిని నింపే సమయంలో పైనుంచి బొగ్గు నేరుగా పిల్లర్లపై పడడంతో అసలుకే మోసం జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**ప్రాజెక్ట్ ఎంతో అవినీతి అంతే...**

సుమారు రూ.400 కోట్లతో సమంత కంపెనీ నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగి ఉండొచ్చునని ప్రజా, కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం జరిగే సమయంలో తూ, తూ మంత్రంగా తనిఖీలు జరగడంతో సమంత కంపెనీ తాను ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా పనులు చేసిందని, పాత సిహెచ్ పి దగ్గర బంకర్ నిర్మాణం జరిగినట్లయితే ఎటువంటి వివాదం ఉండేది కాదని, భారీ అవినీతి జరగడంతోనే బంకర్ నిర్మాణం కిష్టారం పరిసరాల వరకు వెళ్లిందని, అక్కడ భూమి సైతం బంకర్ నిర్మాణానికి అనుకూలంగా లేకపోయినా అధికారులు, కంపెనీ కుమ్మక్కై సింగరేణి చెవిలో పువ్వులు పెట్టారన్నారు. నేడు బంకర్ వల్ల ప్రాణాలు పోగొట్టుకున్న అంబేద్కర్ నగర్ కాలనీవాసుల ఉసురు కూడా తగిలి బంకర్ త్వరలోనే కనుమరుగయ్యే రోజులు కనిపిస్తున్నాయని కిష్టారం, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు అంటున్నారు. రోజుకో బంకర్ కృంగుతుండడంతో అటు సమంతా కంపెనీ, ఇటు అధికారులు చేసిన తప్పులు ఎలా దిద్దుకో వాలా అని తల్లలు పట్టుకుంటున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా సింగరేణి సి అండ్ ఎండి ఈ భారీ ప్రాజెక్టులో అవినీతిని బయట పెట్టడమే కాకుండా, ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను తక్షణమే శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం..

**-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని**

**-రూ.39.5లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎప్పుడూ జరగని విధంగా ఏడాదిలోనే వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేశామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి రూ.4.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం మండలంలో శేషగిరినగర్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడారు. గ్రామీణ రహదారుల అనుసంధానం గ్రామీణ రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పేందుకు, సరైన పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం వలన ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నీరుగారే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనతికాలంలో ప్రతి కేంద్రానికి సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు జిపి కార్యాలయాలు, నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. శేషగిరినగర్ జిపి కార్యాలయం ప్రారంభంతో ప్రజాసేవలు మరింత మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, ఎంపిడిఓ చలపతిరావు, ఎంపివో శ్రీనివాసరావు, ఏఈ రఘురాం, ఏఈ వెంకటస్వామి, ఏఈ శివలాల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, వంగా వెంకట్, ఇలా సాగరపు వెంకటనరసయ్య, రాము, కరిష రత్నకుమారి, పడిగ భవాని, జర్పుల ఉపేందర్, సపావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల్లోనే లబ్ధిదారుల ఎంపిక



**(మొదటిపేజీ తరువాయి)**

కొత్త రేషన్ కార్డులకు సంబంధించి గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని రేషన్‌కార్డులు, ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఒక నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నర్సింహాపురం, బుచ్చిరెడ్డిపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి బనిగండ్లపాడు రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనిగండ్లపాడు, ఎర్రుపాలెం మండలానికి కూడలిగా ఉందని బనిగండ్లపాడును కలిపే అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. బనిగండ్లపాడు అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.జూనియర్ కళాశాల భవనానికి నిధులు మంజూరు చేయనున్నామని ఆయన తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రుపాలెం మండలం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్తిలా మలచుకోవాలన్నారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం (జమలాపురం) వద్ద ఎకో పార్కు, పేటచెరువు, ఇనిద్రమ్మ చెరువులను పర్యాటక ప్రాజెక్టులుగా రూపొందించనున్నామని విక్రమార్క తెలిపారు. ఈనెల 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎటువంటి షరతులు లేకుండా ఎకరాకు రూ. 12వేల చొప్పున రైతు భరోసా సాయం అందిస్తామన్నారు. నూతన రేషన్ కార్డులు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందిస్తామని ఆయన తెలిపారు. పెద్దగోపవరంలో రూ. 48 లక్షలతో నిర్మించిన సహకార పరపతి సంఘం గోడౌన్‌ను, తక్కెళ్లపాడు, సకినవీడు గ్రామాల్లో సిసి రోడ్లకు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి. కళావతిబాయి, ఆర్డీవో నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో భట్టికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలోనూ బ్యాండ్ మేళాలతో ఊరేగింపులు నిర్వహించారు.

# పేరుకే చేపల సొసైటీలు..!

**-చెరువులు గుత్తేదారుల పాలు -సబ్సిడీ చేప పిల్లలు కాంట్రాక్టర్ల వశం**

**-చోద్యం చూస్తున్న మత్స్య శాఖ అధికారులు**



**ప్రజాపక్షం/ముదిగొండ :** మత్స్య సహకార సంఘాల్లోని మత్స్య కారులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల తో పాటు వలలు, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేసి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా ఖమ్మం జిల్లా లోని కొందరు సొసైటీ సభ్యులు వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల నుంచి లీజుకు తీసుకున్న చెరువులలో సొసైటీ సభ్యులు చేపలు పట్టుకొని గ్రామస్తులకు విక్రయించి జీవనోపాధి పొందాలి. అయితే ముదిగొండ మండల పరిధిలోని పెద్ద మండవ, ముత్తారం, వల్లభి, బాణా పురం, కమలాపురం, గంధసిరి, వనం వారి కృష్ణా పురం, బాణాపురం, చిరుమర్రి, మల్లన్న పాలెం తదితర గ్రామాల్లో చెరువులను సొసైటీలు నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా కాంట్రాక్టర్ల కు విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసి కూడా మత్స్య శాఖ అధికారులు ముడుపులు పుచ్చుకుని చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం చేపలు సొసైటీల అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే సొసైటీలే చెరువులను అమ్ముకోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలం లో పెద్ద మండవ చెరువు ను ఆ గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 10 లక్షలకు కొనుగోలు చేసి సభ్యులకు ఏటా రూ.3 వేలు ఇస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా ముత్తారం చెరువును రూ.8 లక్షలకు, వనం వారి కృష్ణాపురం చెరువు రూ. 7 లక్షలకు ఆ గ్రామ మాజీ సర్పంచ్ కొనుగోలు చేసినట్లు సమాచారం. కమలాపురం చెరువు రూ.11 లక్షలు, వల్లభి చెరువు రూ. 10 లక్షలకు, బాణా పురం చెరువు రూ. 8 లక్షలకు, మల్లన్న పాలెం చెరువు రూ. 9 లక్షలకు గుత్తేదారులు కు విక్రయించినట్లు మత్స్య కారులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులను సొసైటీలు లక్షలాది రూపాయలకు బహిరంగంగానే విక్రయిస్తున్న మత్స్య శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో చేప పిల్లలు ప్రభుత్వానివి.. సోకు కాంట్రాక్టర్లది. అన్న చందంగా మండలంలోని చెరువులు పరిస్థితి తయారైంది. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన మత్స్య శాఖ అధికారులు చేప పిల్లలు పంపిణీ మినహా మిగిలిన సమయాల్లో సొసైటీలను, చెరువులను పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మత్స్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువులను గుత్తేదారులు పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయి..

### పోలీసు కమిషనర్ సునిల్‌దత్





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పెరెడ్ గ్రౌండ్‌లో ఆదివారం పోలీసు క్రిడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజిగా ఉండే పోలీసు సిబ్బందిలో నూతన ఉత్సహం నింపేందుకు నిర్వహిస్తున్న ఈక్రిడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతి ఒక్కరూ క్రిడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపొటిల్లో సిబ్బంది పాల్గొని రాణించి జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలు నిలవాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, కల్లూరు సబ్ డివిజన్‌లకు చెందిన సివిల్ పోలీసులతో పాటు, ట్రాఫిక్, ఆర్మ్‌డ్‌రిజర్వ్ ఫోర్స్, స్పెషల్ వింగ్స్ సిబ్బంది మొత్తం 300 మంది క్రిడాకారులు పాల్గొననున్నట్లు సిపి వెల్లడించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంతో పాటు కబడ్డి, లాంగ్, హై జంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, వాలిబాల్, టగ్ ఆఫ్ వార్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. తోలి రోజు ఆదివారం ఖమ్మం టౌన్ వర్సెస్ కల్లూరు టీమ్‌ల మధ్య జరిగిన వాలిబాల్ పోటీలను సిపి సునిల్ దత్ బాల్ విసిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి పోలీసు మిట్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు అడ్మిన్, లా అండ్ ఆర్డర్ నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏఆర్ అడిషనల్ డిసిపి విజయబాబు, ట్రైనీ ఐపిఎస్ రుత్విక్‌సాయి, ఏసిపిలు సాంబరాజు, నర్సయ్య, సుశీల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమాలకు సన్నద్ధం కావాలి

### ఏఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు






**ప్రజాపక్షం/చింతకాని :** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టా ఉద్యమాలకు రైతులు సన్నద్ధం కావాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి చింతకాని మండలం రాఘవాపురం ఏఐకేఎస్ గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగం కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ వవ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నారన్నారు.దేశవ్యాప్తంగా 75శాతం వ్యవసాయ రంగం ఉన్నప్పటికీ బడ్జెట్లో 50శాతం నిధులు కేటాయించడమే రైతులను విస్మరించడమేనన్నారు.దేశ సరిహద్దులో రైతు నాయకులు జగ్‌జిత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నా కనీసం కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు వెంటనే అమలుచేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డియాండ్ చేశారు.రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఆశలు పెట్టుకున్నారన్నారని దానిని అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. చనిపోయినవారికి ,పట్టాదారు పాసుపుస్తకంలేని వారికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నవారికి రుణమాఫీ అమలు కాలేదన్నారు.ప్రభుత్వం ప్రకటించిన రైతుభరోసా పెట్టుబడి క్రింద ఇచ్చే సహాయం ఖరీఫ్ పూర్తయి రభీ ప్రారంభమైనా నేటికి రైతుభరోసా అందించలేదన్నారు.ప్రభుత్వం తక్షణం ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి రెండు సీజన్లకు సంభంధించి రైతు భరోసా ఎకరానికి రూ.12000/అందిచాలన్నారు.రైతాంగ సమస్యల కోసం నూతన ఉద్యమాలను రూపొందిస్తామన్నారు. అనంతరం ఏఐకేఎస్ గ్రామశాఖ నూతన అధ్యక్షుడుగా పుట్టబంతి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా దొబ్బల బోసుతో పాటు మరో 9మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ రైతుసంఘం జిల్లా కోశాధికారి కూచిపుడి రవి,సీపీఐ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మార్గం శ్రీను, మండల నాయకులు పదిమల వెంకటనర్సయ్య, కొల్లి సీతయ్య, సింగారపు సత్యనారాయణ, కొల్లి రవి, చలమల అనిల్, వెంకన్న, దొబ్బల బాబు తదితరులు పాల్గొన్నారు.

# మధిర బస్టాండ్‌కు మహర్దశ

### - బస్టాండ్ ఆధునీకరణకు రూ.10కోట్లు మంజూరు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర బస్టాండ్ ఆధునీకరణ కోసం తెలంగాణ ఆర్టిసి బోర్డు రూ.10కోట్లు నిధులు మంజూరికి ఆమోదం తెలిపింది. హైద్రాబాద్‌లో జరిగిన ఆర్టిసి బోర్డు సమావేశంలో బస్టాండ్ ఆధునీకరణకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రరమార్క ఆదేశాల మేరకు రూ.10కోట్లు నిధులను ఆర్టిసి బోర్డు మంజూరు చేసింది. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన మధిర పట్టణంలో 1984 ఏప్రిల్ 25న మధిర బస్టాండ్ నిర్మాణానికి ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న బస్టాండ్ 1990 అక్టోబర్ 26న ఆనాటి రవాణాశాఖ మంత్రి మొక్కపాటి వెంకటేశ్వరరావు ప్రారంభోత్సవం చేశారు. తెలంగాణ, ఆంధ్రా సరిహద్దుగా ఉన్న మధిర నియోజకవర్గం నుండి వందల సంఖ్యలో ప్రయాణీకులు నిత్యం ప్రయాణిస్తుంటారు. ప్రయాణీకుల సౌకర్యార్థం కేవలం ఆరు ప్లాట్‌ఫామ్‌లతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన మధిర బస్టాండ్‌ను డిప్యూటీ సిఎం ఆధునీకరణ చేయాలని ఆలోచనతో రూ.10కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను తొలగించి దాని స్థానంలో అత్యాధునికంగా కొత్త హంగులతో కొత్త బస్టాండ్ నిర్మాణం చేయనున్నట్లు ఖమ్మం ఇంజీరింగ్ విభాగం ఈఈ తెలిపారు. మధిర బస్టాండ్‌కు నిధులు మంజూరు చేసినందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద పందిళ్ళపల్లి గ్రామానికి మంజూరైన సీసీ రోడ్లకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా అంబటి మాట్లాడుతూ గ్రామ సీమల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున, ఓర్సు వీరభద్రం, ఇనుకుళ్ల నాగసూరారెడ్డి, లింగం రాంబాబు, మందటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా రైతుభరోసా సర్వే



**ప్రజాపక్షం/చింతకాని :** రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి మానస అన్నారు. ఆదివారం చింతకాని మండలకేంద్రంతో పాటు రామకృష్ణాపురం, బస్వాపురం శివారులో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. వ్యవసాయ యోగ్యం లేని భూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గిర్దావర్1 సోయం రఘు, ఏఈవోలు తహినౌషిన్, తేజ, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించండి



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో 3516 ప్లాట్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్న వాటిలో ఇప్పటికే 1485 42% దరఖాస్తులు పరిశీలన పూర్తి అయ్యిందని వైరా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు అన్నారు. ఎల్ఆర్ఎస్ అప్లై చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించమనీ వారి సెల్‌ఫోన్‌కి సమాచారం పంపించడం జరిగింది. వారు ఆన్‌లైన్ ద్వారా మాత్మరే ఫీజు చెల్లించి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చనని కమీషనర్ తెలిపారు. సరైన సమాచారం లేక పోవడం వలన కొన్ని స్థలాలు సిబ్బంది గుర్తించలేక పోతున్నారు. అలాంటి దరఖాస్తుదారులకు సిబ్బంది ఫోన్ చేసి స్థలం చూపించమని అడిగినప్పుడు స్థలం చూపిం ఎల్ఆర్ఎస్ వెరిఫికేషన్ పూర్తి చేయుటకు సహకరించాలని కమీషనర్ కోరారు. 261 మంది దరఖాస్తుదారులు సరైన వివరాలు దస్తావేజులు సమర్పించలేకపోవడం వలన వారికి సెల్‌ఫోన్ ద్వారా షార్ట్‌ఫాల్ సమాచారం ఇచ్చామని, వారు సంబంధించిన దస్తావేజులు అప్‌లోడ్ చేసి తదుపరి ఎల్ఆర్ఎస్ పరిశీలనకు సహకరించాలని, దరఖాస్తుదారులకు ఏమైనా సమస్యలు ఉంటే మున్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కమీషనర్ సిహెచ్.వేణు, టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికల భాస్కర్ తెలిపారు.

# అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి దుర్మార్గం

**ప్రజాపక్షం/వైరాః** ఆమ్‌ఆద్మీ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభంజనం చూసి ఓర్వలేక బిజెపి, దాని అనుబంధ సంస్థలు, మతోన్మాద శక్తులు భౌతికదాడులకు సైతం పూనుకోవడం అత్యంత దుర్మార్గం అని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, వైరా నియోజకవర్గ ఇంచార్జి గుత్తా నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఆకస్మాత్తుగా తన మేనిఫెస్టోలో ఢిల్లీ ప్రజలకు మాత్రమే ఉచిత విద్యుత్, సమాజంలో కొన్ని వర్గాలకి బస్సులో ఉచిత ప్రయాణం తదితర అనేక తాయిలాలను ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందని ఆరోపించారు. ఢిల్లీ ప్రజలు ఎప్పుడు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా పాలన నిర్వహించిన ఆమ్‌ఆద్మీ పార్టీనే బలపరచడానికే సిద్ధం అయ్యారని, అందుకే బిజెపి దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు కావాలనే రాళ్ళ దాడికి పూనుకున్నారని ఆరోపించారు.

# పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం, సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం మధిర మున్సిపల్ పరిధిలో ఐఎటీయూసి ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. అలాగే కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, కాలనీల సంఖ్యకు అనుగుణంగా కార్మికులను కూడా పెంచాలన్నారు. 60సంవత్సరాలు నిండిన ప్రతికార్మికుడిగా రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇంట్లో వారికి ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా ఎఐటీయూసి ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు గాదే లక్ష్మీ నారాయణ, సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవి,, ఎఐటీయూసి మధిర డివిజన్ అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు యంగల ఆనందరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేంద్రం, నరేష్, బుజ్జి, శ్రీకాంత్,, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట మున్సిపాల్టీగా రాజపత్రం విడుదల



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గం కేంద్రంను ఎట్టకేలకు మున్సిపాల్టీగా ఏర్పాటు చేయటానికి శని వారం గెజిట్ నోటిఫికేషన్ రాజపత్రం విడుదలైంది. అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెర్వులను కలిపి మూడు పంచాయతీలను మున్సిపాల్టీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసింది. ప్రస్తుతం అంచనాల ప్రకారం అశ్వారావుపేట 22,366 మంది పేరాయిగూడెం 8082 మంది, గుర్రాలచెర్వు 1248 మంది మొత్తం 31,696 మంది జనాభా నిష్పత్తి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. తీర్మానాలను రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపింది. రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం ప్రకారం గవర్నర్ రాజపత్రం విడుదల చేసింది. మున్సిపాల్టీ పరిధిలోని సుమారు 16,665మంది ఓటర్లు ఉన్నారు. గత రెండు సంవత్సరాలుగా మున్సిపాల్టీగా అశ్వారావుపేట అవుతుందని ఎదురుచూసిన ప్రజలకు నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం ప్రకటించడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామ సరిహద్దుల్లో ఆదివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనలు ఢీకొని మొద్దులగూడెం గ్రామానికి చెందిన తోకల శ్యామ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అప్పారావుపేట గ్రామంలో కార్యక్రమంలో పాల్గొని తిరిగి గండుగులపల్లి వెళ్తున్న ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదాన్ని గమనించి తక్షణ స్పందించి తన సిబ్బందితో కలిసి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తన కారులో దమ్మపేట ప్రాథమిక కేంద్రానికి తీసుకువచ్చారు. అంతేకాకుండా అక్కడే ఉండి క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సుమారు 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రంలో ఉండి ప్రథమ చికిత్స చేయించి గాయపడిన వారికి ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం కోసం ఏదైనా అవసరమైతే తనను సంప్రదించాలని అన్నారు. ఎమ్మెల్యే చేసిన ఈ పనికి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు అభినందిస్తున్నారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు ఇస్తాం



**ప్రజాపక్షం/దమ్మపేట:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం రేషన్ కార్డులపై ఎమ్మెల్యే కీలక ప్రకటన చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తాం అని, పాత రేషన్ కార్డులు తీయడం ఉండదని, పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేరుస్తాం అని అపోహలు నమ్మొద్దు అని, కులగణన ఆధారంగా రేషన్ కార్డుల ప్రక్రియ జరుగుతుందని, లీస్ట్‌లో పేరు లేకపోతే ఆందోళన చెందవద్దని, గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వివరించారు.

## నేడు జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఈ నెల 20వ తేదీన సోమవారం ఉదయం 12 గంటలకు జూలూరుపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన నిరుపేదలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, రైతు భరోసా అర్హులైన వారికి ఇవ్వాలని కోరుతూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు.

## కోలేటి శ్రీనివాసరావుకు నివాళి



**ప్రజాపక్షం/ముదిగొండ :** మండల పరిధిలోని మల్లన్న పాలెం గ్రామ మాజీ సర్పంచ్ కోలేటి శ్రీనివాసరావు చిత్ర పటానికి ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు హాజరై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత మృతిని కుమారులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. వారి వెంట మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకట్, మండల నాయకులు బంకా మల్లయ్య, పాము శిల్పరాజు, పచ్చా సీతారామయ్య, కోటి అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు కల నెరవెరేదెన్నడో..!

**-యువజంటలకు దూరమవుతున్న రేషన్‌కార్డులు**
**-పదేళ్ల నిరీక్షణకు ఫలితం దక్కేనా..?**
**-ప్రజాపాలనలో సీన్ రివర్స్**
**-తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ నాయకులు**






**ప్రజాపక్షం/బోనకల్:** సామాన్య ప్రజల కల..సొంత రాష్ట్రంలో పదేళ్ల నిరీక్షణ..ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. ప్రజాపాలనలో అయినా కొత్త రేషన్‌కార్డులు వస్తాయని అందరూ భావించారు. కానీ ప్రజల ఆడిఆశలు అయ్యాయి. అంత అన్నారు...ఇంత అన్నారు...చివరకు ఏమిలేని విధంగా మారింది. జనవరి 26న నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాలు అమలు చేసేందుకు సిద్దమైంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సర్వే కూడా నిర్వహిస్తుంది.. ఇది ఆదిలోనే ఆగమాగంగా మారడం ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఏదైనా ప్రభుత్వ పథకానికి అర్హత పొందాలన్నా ..ఆదాయం, కులం లేదా ఏమైనా సర్టిఫికెట్స్ కావాలన్నా రేషన్‌కార్డులు కావాల్సిందే.. దాదాపు పదేళ్ల నుంచే రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో అప్పటి నుంచి కొన్ని వేల మంది వివాహం జరిగిన జంటలు రేషన్‌కార్డులు పొందలేకపోయారు. చాలా మందికి రేషన్‌కార్డులు ఉన్నా పిల్లల పేర్లు చేర్చలేకపోయారు. గణాంకాల ప్రకారం వీరి సంఖ్య లక్షల్లో ఉంటుంది. అయితే అలాంటి వారి కోసం ఇటీవల ప్రకటన విడుదల చేసింది. కొత్తరేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం జనవరి 26న ప్రారంభించనున్నట్లు తెలిపింది. అయితే కొత్త రేషన్‌కార్డుల లబ్దిదారులను ప్రజాపాలన దరఖాస్తులు ఇటీవల చేసిన కులగణన సర్వే ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రజాపాలన, కులగణన దరఖాస్తుల ఆధారంగా కొత్త రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపిక జరగుతుందని పేర్కొంది. క్షేత్ర స్థాయిలో అధికారులు గ్రామాలను సందర్శించి కొత్త రేషన్‌కార్డుల లబ్దిదారులను ఎంపిక చేస్తారని, దీనికోసం గ్రామసభలు కూడా జరుగుతాయని పేర్కొంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనపై అందరూ సంబరపడ్డారు. తమకు రేషన్ కార్డు వస్తుందని ఆశపడ్డారు. కానీ ఇది ఆదిలోనే అందరిని ఆయోమయానికి గురిచేసింది. బోనకల్, ముష్టికుంట్ల, రావినూతల, ఆళ్లపాడు, రాయన్నపేట, కలకోట తదితర గ్రామాలలో పంచాయతీ అధికారులు వద్ద ఉన్న జాబితా పరిశీలించి, అందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన సర్వేనా? లేక టిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగినా సర్వేనా? అని అంటూ మండిపడుతున్నారు. వందలాంది మంది దరఖాస్తు చేస్తే కొత్త రేషన్‌కార్డు జాబితాలో పదుల సంఖ్యలో పేర్లు ఉండడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది అర్హులు ఉన్నా అరకొరగా పేర్లు రావడం ఏమిటంటూ, అటు అధికారులను, ఇటు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారు. దీనితో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఏమి సమాధానం చెప్పలేక మొఖం చాటువేస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా కొత్తరేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపికపై ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కొత్తరేషన్‌కార్డుల కల ప్రజాపాలనలో సాకారం అవుతుందని అనుకుంటే, కథ మళ్లీ మొదటికి వచ్చిందంటూ బహిరంగంగా విమర్శలు వస్తుండడంతో ప్రస్తుతంతో మండలంలో హాట్ టాపిక్ మారింది.

**-పదేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నా.**
**దారగాని హుస్సేన్, ముష్టికుంట్ల.**



గ్రామంలోనే ఒక ఇంటిని కిరాయికి తీసుకోని ఇద్దరు పిల్లలు, భార్యతో జీవనం కొనసాగిస్తున్నాం. పొస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేశాను. ఉపాధీ లేకపోవడంతో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. పంచాయతీ కార్యదర్శి చేసే రేషన్‌కార్డు సర్వేలో మా పేర్లు లేవు. నా తల్లి దండ్రుల రేషన్‌కార్డులో నాపేరు తొలగించుకున్నాను. నా భార్య వారి తల్లిదండ్రుల రేషన్‌కార్డులో కూడా తన పేరు తొలగించాను. గత పదేళ్లుగా మా కుటుంబానికి పిడిఎస్ బియ్యం అందడం లేదు. ప్రభుత్వం జనవరి 26న ఇచ్చే రేషన్‌కార్డులో అవకాశం కల్పించాలి.

**-వివాహమయి ఏడేళ్లు అయినా రేషన్‌కార్డు లేదు**
**గుంపుల మనీష్, చిరునోముల.**



వివాహమై నేటికి ఏడేళ్లు గడుస్తుంది. కుమారుడు, భార్య ఉన్నారు. ఇద్దరం పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేశాం. ప్రవేట్ సంస్థలలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అందాలన్నా రేషన్‌కార్డు ప్రామాణికమైంది. రేషన్ కార్డులో సర్వే మా పేర్లు లేవు. రేషన్‌కార్డు ఇక అందదేమో అని నిరాశ కలుగుతుంది. ప్రభుత్వం అర్హులైన పథకాలను అందేలా ప్రాధాన్యత కల్పించాలి.

## తాటిపూడి గ్రామంలో అస్తవ్యస్తంగా రోడ్ల పక్కన పిచ్చి చెట్లు

**-పారిశుద్ధ్యం పట్ల అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**
**-ఇలా రోడ్ల పక్కన చెట్లు ఉంటే రాత్రిపూట నడిచేది ఎలా?**
**-కనిపించని ప్రత్యేక అధికారులు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామపంచాయతీలో రోడ్ల వెంబడి పిచ్చి చెట్లు పెరిగి అస్తవ్యస్తంగా రోడ్లు దర్శనమిచ్చాయి. డ్రైనేజీల్లో నీరు నిలిచి ఎటు పోకుండా కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు ఎటుపోకుండా నిల్వ ఉంది. గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న చేతిపంపు పిచ్చి మొక్కల మధ్య దర్శనమిస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామపంచాయతీలో అడుగడుగునా రోడ్ల ప్రక్కన పిచ్చి చెట్లు వేపుగా పెరిగి నడిచే బాటసారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. ఇలా రోడ్ల ప్రక్కన పిచ్చి మొక్కలు ఆనుకొని వేపుగా పెరుగుతుంటే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదు. రాత్రిపూట రోడ్లపై నడవాలంటే రోడ్డు ప్రక్కనున్న పిచ్చి మొక్కల నుంచి ఎలాంటి విషపూరిత పాములు తేలులు బయటకు వస్తాయే ఏమవుతుందని ప్రజలు భయపడుతున్నారు. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరుకు మోటార్ పెట్టి నీటిని వాడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీరు ఎటుపోకుండా నిల్వ ఉండడంతోదోమలు వృద్ధి చెందుతున్నాయి. తాటిపూడి పంచాయతీ అస్తవ్యస్తంగా ఉండటానికి ఇంతకంటే ఏమి నిదర్శనం కావాలి. పంచాయతీ పాలకవర్గం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులను కూడా ప్రభుత్వం కేటాయించింది. కనీసం ప్రత్యేక అధికారులు కనుచూపుమేర వరకు కూడా పంచాయతీల్లో కనిపించకపోవడం విశేషం. గతంలో ఇదే తాటిపూడి గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో జ్వాగాలు వచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. పటిచుకోవాల్సిన గ్రామపంచాయతీ సెక్రటరీ రోడ్ల ప్రక్కన వేపుగా పెరిగిన పిచ్చి మొక్కలు కనపడడం లేదా. ఎందుకు మరి ఇంత నిర్లక్ష్యం ఉన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల అధికారులకు ఉన్న శ్రద్ధ ఇదేనా. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో రోడ్ల ప్రక్కన విపరీతంగా పెరిగిన పిచ్చ మొక్కలను తొలగించి చేతిపంపుల వద్ద ఎలాంటి నీరు నిల్వకుండా ఉండకుండా పిచ్చి మొక్కలు పెరగకుండా శుభ్రపరిచే విధంగా చూడాలి. అదేవిధంగా డ్రైనేజీల్లో నీరు ఎక్కడ ఆగకుండా బయటకు పోయేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మొక్క జొన్న పంటపై రైతుల ఆశలు..!

**మండలంలో విరివిగా మొక్క జొన్న సాగు**



**ప్రజాపక్షం/ముదిగొండ :** ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన మొక్క జొన్న పంట పై రైతులు ఆశలు విరివిగా ఉన్నాయి. ప్రధానంగా మండలం లో పత్తి పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది తీవ్రంగా నష్ట పోయారు. అతి వృష్టి కారణంగా పత్తి పంట ఎదుగుదల సరిగా లేకపోవడం, సరైన కాపు లేకపోవడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల కు మించి దిగుబడులు రాలేదు. దీంతో పత్తి పంట తొలగించి రబీలో రైతులు భారీగా మొక్క జొన్న సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న మెట్ట భూముల్లో ప్రస్తుతం ఎటుచూసినా మొక్క జొన్న పంటే కనిపిస్తుంది. మొక్క జొన్న పంట కూడ వివిధ దశల్లో దర్శనమిస్తూ భూములు కళకళలాడుతున్నాయి. పెట్టుబడి ఖర్చులు తక్కువగా ఉండటం, దిగుబడులు కూడ ఆశాజనకంగా ఉండటంతో రైతులు మొక్క జొన్న పంట నే దృష్టి సారించారు. గత ఏడాది యాసంగి లో వేసిన మొక్క జొన్న దిగుబడులు కూడ ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఈ ఏడాది కూడ మొక్క జొన్న వైపు ఆశక్తి కనబర్చారు. కాగా మండలం లో 2023 యాసంగి లో సుమారు 14509 ఎకరాల్లో రైతులు మొక్క జొన్న పంటను సాగు చేయగా 2024 యాసంగి లో సుమారు 15800 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా 2023 సంవత్సరం లో మండలం లో సుమారు 7934 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేయగా 2024 సంవత్సరం లో సుమారు 9800 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేసారు. కాగా మిర్చి పంటకు గత సంవత్సరం తామర పురుగు సోకి పంట మొత్తం పసుపు రంగు వచ్చి దెబ్బతిన్న విషయం విదితమే. మరి ఈ ఏడాది మిర్చి పంట దిగుబడులు ఎలా వస్తాయని వేచి చూడాలి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడ మొక్క జొన్న పంట కు ఆశాజనకంగా దిగుబడులు వస్తాయని ఆశతో రైతులు మొక్క జొన్న పంట వైపు మొగ్గు చూపారని అవగతమవుతుంది.

# ఈ థియేటర్లకు అనుమతులు ఎలా..?

*** హైవేపై వాహనాల పార్కింగ్...**
*** సాధారణ ప్రేక్షకులకు త్రాగునీటి సౌకర్యం నిల్...?**
*** సినిమా కొస్తే సాధారణ ప్రేక్షకుడి జేబుకు చిల్లేనా..?**
*** నాలుగు కార్లు, 10 బైకులు పట్టే ప్రదేశంలో పార్కింగ్ సాధ్యమేనా...?**
*** అగ్ని ప్రమాదం సంభవిస్తే ప్రేక్షకుల పరిస్థితేమిటి...?**
*** అడ్వాన్స్ బుకింగ్ లేకపోవడానికి కారణం ఏమిటి..?**
*** థియేటర్ ముందు స్థలాలు లీజుకిస్తున్నారా..?**
*** అధికారులెక్కడ..? ఏం చేస్తున్నారు..?**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అర, కొర వసతులున్న థియేటర్లకు అనుమతులు ఎలా అని ప్రశ్నిస్తున్నారు ప్రేక్షకులు. వినోదం కోసం సినిమాకి వచ్చే సాధారణ ప్రేక్షకుడికి త్రాగునీటి సౌకర్యం కల్పించలేని స్థితిలో సత్తుపల్లిలోని థియేటర్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదని. టికెట్ తీసుకున్నది మొదలు, శుభం కార్డు పడేవరకు ప్రేక్షకుడి జేబుకి చిల్లులు ఖాయమే అంటున్నారు. పట్టణంలో గల ధియోటర్‌లలో రూ. 2 రూపాయల సమోసాను, రూ.5 రూపాయలకు అమ్మి జేబులు నింపుకుంటూ, సినిమా కొచ్చిన ప్రేక్షకుల జేబులకు చిల్లులు పెడుతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే వారు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ సైన్యంతో దాడులు చేపించేందుకు కూడా వెనుకాడటం లేదని, థియేటర్ లో ఉన్న ప్రైవేట్ సైన్యం సైతం ప్రేక్షకులకు మర్యాద ఇవ్వకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోతున్నారు ప్రేక్షకులు. నాలుగు కార్లు, 10 బైకులు పట్టే ఈ సినిమా హాళ్ళకు అధికారులు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారో అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సమయాలలో థియేటర్ లోపల వాహనాల పార్కింగ్ కు స్థలం సరిపోకపోవడంతో , రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసి ప్రేక్షకులు సినిమాలకు వెళుతుండటం కొసమెరుపు. సినిమా థియేటర్లోకి అడుగుపెట్టిన ప్రేక్షకుడిని మూడు గంటల పాటు జైలులో బంధించినట్లు థియేటర్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని ప్రేక్షకులు మండిపడుతున్నారు. బయట రూ. 20 రూపాయలకు దొరికే వాటర్ బాటిల్ ని రూ.40 రూపాయలకు, శుచి, శుభ్రత లేకుండా చేస్తున్న జంక్ ఫుడ్ ను అధిక ధరలకు విక్రయిస్తూ ప్రేక్షకుల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారు థియేటర్ యాజమాన్యాలు. పార్కింగ్ ఫీజు పేరుతో ద్విచక్ర వాహనానికి రూ.20 నుంచి రూ. 30 రూపాయల వరకు. , కారుకు రూ. 50 నుంచి రూ. 100 రూపాయల వరకు సందర్భాన్ని బట్టి వసూలు చేస్తున్నట్లు ప్రేక్షకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. థియేటర్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా, పూర్తి రక్షణగా ఉంటేనే అనుమతులు ఇవ్వాల్సిన అధికారులు ఏ విధంగా అరకొర వసతులు ఉన్న థియేటర్లకు అనుమతులిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాల నాయకులు. సత్తుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ థియేటర్ తమ గేట్ల ముందు కూరగాయల షాపులు, న్యూడిల్స్ బండ్లు తదితర వాటికి రోజువారి చొప్పున అద్దెలకు ఇస్తూ ప్రేక్షకుల రక్షణను గాలికి వదిలేస్తున్నారని కొందరు రాజకీయ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. థియేటర్లలో అనుకోని ప్రమాదం సంభవిస్తే అటువంటి ప్రమాదాలను నివారించడానికి ఎటువంటి రక్షణ చర్యలు కనిపించడం లేదని, ప్రేక్షకులు బయటకు పరిగెత్తే సమయంలో కూడా గేట్ల ముందు అడ్డంగా చిరు వ్యాపారాలు జరుగుతుండడంతో భారీగానే ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగే సూచనలున్నాయని హెచ్చరిస్తున్నారు మేధావులు. త్రాగునీరు, పార్కింగ్, రక్షణ చర్యలు తదితరాలను అంతగా పట్టించుకోని థియేటర్ యాజమాన్యాలు టికెట్లను ఆన్ లైన్ ద్వారా విక్రయిస్తూ ప్రేక్షకుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం లేకుండా ప్రేక్షకులను గంటల తరబడి క్యూలలో ఎందుకు నిలబెడుతున్నారో థియేటర్ యాజమాన్యాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు ప్రేక్షకులు. అరకొర వసతులున్న థియేటర్లకు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారని, తక్షణమే సత్తుపల్లి పట్టణంలో గల థియేటర్లను మున్సిపాలిటీ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖాధికారులు పరిశీలించి ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్న థియేటర్లకు మాత్రమే అనుమతులు మంజూరు చేసి, అరకొర వసతులున్న థియేటర్లను సీజ్ చేయాలని ప్రజలు, ప్రేక్షకులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు కోరుతున్నారు.

## గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

**- తహశీల్దార్ రాంబాబు వెల్లడి**



**ప్రజాపక్షం/ మధిర :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ గృహాలు, ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, కమీషనర్ సంపత్‌కుమార్, వ్యవసాయశాఖ ఎఓ సాయి దీక్షిత్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి నాలుగు ప్రతిష్టాత్మకమైన పథకాలను ప్రభుత్వం అమలుచేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు మున్సిపాల్టీలో వార్డుల వారీగా, మండలంలో గ్రామాల వారీగా గ్రామసభలో నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా దరఖాస్తు చేసుకోవాలని గామ సభల ద్వారా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్ల అందజేత




**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు జడ్పీ హైస్కూల్లో బోధిధర్మ షోటొకాన్ స్పోర్ట్స్ కరాటి దూ అసోసియేషన్ మణుగూరు ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న, ప్రతిభ కలిగిన విద్యార్థులకు బెల్ట్, గుర్తింపు సర్టిఫికెట్లను ఆదివారం తహశీల్దార్ రాఘవరెడ్డి, సిఐ సతీష్‌కుమార్‌లు అందజేశారు.

## ముత్యాలమ్మ గుడిలో అమ్మ వారి హుండీ చోరీ




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు అశోక్ నగర్ టెలిఫోన్ ఎక్స్చెంజ్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ గుడిలో అర్ధ రాత్రి దొంగలు హల్ చల్ చేశారు. గేట్ పగలగొట్టి లోపలికి వెళ్లి అమ్మ వారి హుండీ దొంగలించారు. హుండీలో ఎంత డబ్బులు ఉన్నాయి.. ఇంకా ఏమి దోచుకొని వెళ్లారు.. తదితర పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 17వ యూసుఫ్ కప్ 2025 విజేత కొత్తగూడెం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల కేంద్రంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ హోరా హోరిగా సాగింది. ఫైనల్‌లో సారపాక, కొత్తగూడెం జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఫరీద్ ఎలెవన్ కొత్తగూడెం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. 155 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటుపల్లి ఎలెవన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 138 పరుగులే చేసి ఓటమి చవి చూసింది. కొత్తగూడెం జట్టులోని బ్యాటర్ నితిన్ 56 పరుగులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. ఈ బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ క్రీడలు అనేవి యువతలో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారి ప్రతిభను ప్రపంచ నలుమూలలు చాటి చెప్పడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ కూడా 17 సంవత్సరాలుగా నిర్వహించడం హర్షనీయమన్నారు. బూర్గంపాడు యువత ఆదర్శప్రాయులన్నారు. తదనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీ స్పాన్సర్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, బుద్దరాజు నవీన్ బాబు, క్యాష్ ప్రైజ్ విజేతలకి అందజేయగా, ట్రోఫీ స్పార్సర్ దేగల రాజు యాదవ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సొసైటీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బ్రిలియంట్ స్కూల్, కళాశాల అధినేత డా బిఎన్ఆర్, పినపాక నియోజకవర్గ మహిళా బి బ్లాక్ అధ్యక్షులు బర్ల నాగమణి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సోహైల్ పాషా, సర్వేశ్వరరావు, గోనెల నాని, భజన సతీష్, భజన ప్రసాద్, అబ్దుల్ సలీమ్, సారథి, సతిపండు, కిషోర్, మంద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడిన ఏడాది కాలంలో మహిళలకు పెద్ద పీట వేసి అనే సంక్షేమ పథకాలు అమలు చేసిందని, నిరుపేదలు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, ఆహార భద్రత కార్డులు అందజేస్తుందన్నారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అన్నారు. మీ కుటుంబలో అనారోగ్య పాలై మెరుగైన వైద్యం చేపించుకోలేని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తుందని అన్నారు. రూ 16,75,000 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను 45 మంది లబ్దిదారులకు అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

**- డిఎంఅండ్‌హెచ్ఓ కళావతిభాయి**

**ప్రజాపక్షం/ మధిర రూరల్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని డిఎంఅండ్‌హెచ్ఓ కళావతిభాయి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, హాజరు వివరాలు, పిహెచ్‌సికి వచ్చే ఓపి రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యంపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.సాయి, డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకూరి దివ్యశృతి, సిహెచ్ఓ వి.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ భరోసా నిబంధనలు సవరించండి

**-పేదరికానికి పని దినాలు కొలబద్ద కాదు**
**-బికెఎంయు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు సవరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలతో ముడి పెట్టి లబ్దిదారులను ఎంపిక చేయరాదని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఏన్కూరు మండల పర్యటనకు వచ్చిన భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత నిబంధనల ప్రకారం అనేక మంది అర్హులు లబ్దిదారులుగా ఎంపికయ్యే పరిస్థితి లేదని తెలిపారు. సెంటు భూమి లేని వారు వేలాది మంది 20రోజులు పాటు జాతీయ ఉపాధి హామీ పథకం పనికి హాజరు కానివారు ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో సకాలంలో కూలీ డబ్బులు రానందున వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారని ఈవిషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పేదరికానికి ఉపాధి హామీ పని దినాలు కొలబద్ద కాదని వెంకటేశ్వరరావు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన భట్టివిక్రమార్క పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, పెరుమాళ్లపల్లి ప్రకాషరావు, తలారి రమేష్ తదితరులు ఉన్నారు.

# రైతులను బలిపశులు చేయకండి

**జిల్లా రైతు సంఘం**
**అధ్యక్ష, కార్యదర్శులు కొండపర్తి, దొండపాటి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయకుండా రైతులను బలిపశువులను చేస్తే చూస్తూ ఊరుకునేదిలేదని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. మండల పరిదిలోని చిన్నగోపతి గ్రామంలో ఆదివారం రైతుసంఘం గ్రామశాఖ మహాసభ లో పాల్గొని ప్రసంగించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో రైతులపట్ల పాలకులు సవతితల్లిప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 50 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చీడపీడలవలన, తుఫానులు సంబవించినప్పుడు రైతులు నష్టపోకుండా పంటలభీమా పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆరోగ్య భద్రత, వృద్దాప్య పించన్ కల్పించాలని, రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని అన్నారు. పంటల పెట్టుబడి కోసం ఎకరానికి రెండు లక్షల రూపాయలు పావలవడ్డీచొప్పున బ్యాంకుల్లో రుణసౌకర్యం కల్పించాలని అన్నారు. సమగ్ర భూసర్వేద్వారా సాదాబైనామాలో ధరఖాస్తు చేసుకున్న రైతులకు పాసుపుస్తకాలు ఇవ్వాలని అన్నారు. గ్రామగ్రామాన రైతుసంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈమహాసభలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతుసంఘం మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య, పొట్లపల్లి వెంకటశ్వర్లు, బండారు కొరివీరు తదితరులు పాల్గొన్నారు. రైతుసంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా గొడ్డుగొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా దేరంగుల లక్ష్మయ్యతోపాటు 11 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నిరుపేదల గుడిసెలు తొలగించడం దుర్మార్గం




**ప్రజాపక్షం/దమ్మపేటః** మండల కేంద్రంలో శనివారం మల్లారం కాలనీ వద్ద పోలీస్ రెవెన్యూ శాఖ వారి సంయుక్తంగా కలిసి గుడిసెలను తొలగించడం జరిగింది. ఈ విషయాన్ని సీపీఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి తీవ్రంగా ఖండించరు. ఈ సందర్భంగా అమర్లపూడి రాము మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా, అసంపూర్తిగా కట్టకుండా ఉన్న డబల్ బెడ్ రూమ్ స్థలంలో గత 15 రోజులుగా నివాస స్థలాలు లేని నిరుపేదలు గుడారాల నిర్మించుకొని నివసిస్తున్న వారిపై మండల రెవిన్యూ, పోలీసు అధికారులు విచక్షణా రహితంగా దాడులు నిర్వహించటం దుర్మార్గమని అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న ఆ డబల్ బెడ్ రూమ్ స్థలాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులకు అక్కడ నిరుపేదలు నివాస ఏర్పాటు చేసుకున్న వెంటనే గుర్తుకు రావటం విచారంగా ఉందన్నారు. పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి దౌర్జన్యంగా వారి గుడారాలను తొలగించి దౌర్జన్యం చేయడాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ దమ్మపేట మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అమర్లపూడి రాము అన్నారు. దౌర్జన్యంగా వారి నివాసాలను తొలగించడమే కాకుండా అడ్డుకున్న వారిపై అక్రమంగా పోలీసులు కేసులు పెట్టడం దుర్మార్గ చర్య అని అన్నారు. ఇప్పటికైనా వెంటనే నిరుపేదలకు స్థలాలతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తోడం దుర్గమ్మ, పండూరి వీరబాబు, అనిల్ కుమార్, పెళ్లూరి జగదీష్, పి.శంకర్, గంగాధర నాగమణి, జుంజునూరి ముక్తేశ్వరి, కడమంచి నాగవల్లి, దాసరి సుజాత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/ముదిగొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకునే బీఆర్‌ఎస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ లు మాట్లాడారు. మండల పరిధిలోని పమ్మి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు హాజరై మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమే ధ్యేయంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వారు ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో ఎటువంటి పంతాలకు పోకుండా అవసరమైతే మండలం లో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా పార్టీలైన వామపక్షాలతో కలసి ప్రయాణించాలని ఈ సందర్భంగా వారు వివరించారు. అదే విధంగా స్థానిక ఎన్నికల్లో మరోసారి మాయ మాటలతో ప్రజలను మోసం చేయటానికి ఈనెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందిని సదరు పథకాలపై గ్రామ సభల్లో నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్, మండల నాయకులు బంకా మల్లయ్య, పాము శిలువ రాజు, కోయ రమేష్, కోటి అనంత రాములు, తాటికొండ ఉపేందర్, రాయబారపు ఉపేందర్, రమేష్, కటింగ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతను తవ్వారు.. వదిలేశారు...

**-ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్‌రోడ్డులో వాటర్ ట్యాంక్‌ప్రక్కన మరో ట్యాంక్ నిర్మించేందుకు గుంతను తవ్వారు. ఆ గుంతకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకుండా గత కొన్నిరోజులుగా ఎలాంటి రక్షణ లేకుండా వదిలేశారు. ఇలా అయితే ఏమైనా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది? ఎందుకంటే ఈ ప్రాంతంలో ఎంతోమంది పిల్లలు వృద్ధులు తిరుగుతూ ఉంటారు. నిత్యం ఎలక్ట్రిసిటీ బిల్స్ కట్టడానికి వచ్చిన వారు కొంతమంది ప్రక్కనే ఉన్న చెట్ల వద్దకు వెళ్లి నిల్చోవడం పాటు పిల్లలను కూడా వదిలిపెడుతూ ఉంటారు. ఇలా రక్షణ లేకుండా గుంతను తవ్వి అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయారు తప్ప ఈ గుంతల వలన ఎవరికైనా ఎలాంటి ప్రమాదం జరుగుతుందని ఒక్కసారి సంబంధిత అధికారులకు ఆలోచన రాలేదా. ఇప్పటికైనా అధికారులు గుంత నిర్మాణానికి చేపట్టే ముందు చుట్టుప్రక్కల దానికి ఎలాంటి హాని కలగకుండా గుంతకు రక్షణ ఏర్పాటు చేయాలి చుట్టుప్రక్కల ప్రజలు కోరుకుంటున్నారు.

# కన్నెగంటి నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ 8వ వార్డులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నెగంటి నాగేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదివారం కన్నెగంటి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కన్నెగంటి నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, పాలేటి నర్సింహారావు, కట్ల సంతోష్, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, పోలా శ్రీనివాసరావు, బండారు తిరుపతిరావు, యడ్లపల్లి వీరయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# 115 నెలలుగా బోడేపూడి ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం/వైరాః** బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడో ఆదివారం సిపిఎం కార్యాలయంలో బోడేపూడి వెంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే వైద్యశిబిరాన్ని ఆదివారం 115వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపూడి వైద్యశిబిరం ద్వారా గత 115 నెలలుగా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను రూ.100లకు అందిస్తున్నారని అన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వైద్య బృందం విక్రమ్ సింగ్, శ్రీకాంత్, ప్రశాంత్, పాషా ఉచితంగడా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని అన్నారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు గుండె, శ్వాసకోశ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్యశిబిరం వాలంటీర్లు, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కొంగర సుధాకర్, యనమద్ది రామకృష్ణ, పాసంగులపాటి చలపతిరావు, కంభంపాటి సత్యనారాయణ, ఐలూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# ప్రమాదహరిత పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుదాం

- ట్రాఫిక్ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత
- రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం
- పార్కింగ్ కోసం స్థలాలను అన్వేషించాలి
- కార్పోరేషన్ ఏర్పాటుతో అధికారులపై మరింత బాధ్యత
- రోడ్డు భద్రత వారోత్సవాల సభలో ఎంఎల్ఏ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం :** సన్వయంతో పనిచేసి కొత్తగూడెం పట్టణాన్ని ప్రమాదహరితంగా తీర్చిదిద్దుదామని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. జాతీయరోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జరిగిన పోలీస్ సిబ్బంది, వ్యాపారులు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, పట్టణ ప్రముఖులతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఎంఎల్ఏతో పాటు ఎస్‌పి రోహిత్ రాజ్ హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యతే కాదని, దీనిని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. మద్యం, నిర్లక్ష్యం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి తగినన్ని నిధులు రాబడుతున్నామని, పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ సెంటర్లో ప్రమాదాలను గుర్తించేందుకు సిసి కెమోరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పార్కింగ్ స్థలాల కోసం ప్రభుత్వశాఖలు స్థలాలు అన్వేషించిన నివేదికలు ఇవ్వాలన్నారు. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి దుకాణాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, నిబంధనలకు అనుగుణంగా చిరువ్యాపారాలు సాగాలన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుతో అన్నిశాఖల బాధ్యత పెరుగుతుందని, సమన్వయంతో పనిచేసి సమస్యలు అధిగమించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కొత్తగూడెం డిఎస్‌పి అబ్దుల్ రహేమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తహశిల్దార్ పుల్లయ్య, ఆర్‌డిఓ వెంకటనారాయణ, ఆర్‌అండ్‌బి డిఇ నాగేశ్వరరావు, కమీషనర్ శేషాంజన స్వామి, ఆర్‌డిసి డిపో మేనేజర్ దేవేంధర్ గౌడ్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, రమణమూర్తి, వి మల్లిఖార్జునరావు, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, పల్లపోతు సాయి, అబీద్, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, రత్నకుమారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేజర్ కాల్వ కట్ట ఆక్రమణకు గురి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్ల బస్వాపురం సమపంలోగల వైరా మేజర్ కాల్వకట్టను కొంతమంది రైతులు ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని కొణిజర్ల రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఓ పేరుమోసిన రాజకీయ నాయకుడి కుమారులు మేజర్ కాల్వ కట్టను ఆక్రమించి పంటసాగుచేస్తున్నారని ఎన్నెస్పీ అధికారులు కూడా ఈవైపు కన్నెత్తి చూడటంలేదని వారు అంటున్నారు. కాల్వ కట్టను ఆక్రమంచడంవలన కట్ట కోతకు గురై రైతులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది అవుతుందని వారు ఆరోపిస్తున్నారు. రైతులు ఒకరనిచూసి ఇంకొకరు ఈవిధంగా మేజర్ కాల్వ కట్టను ఆక్రమిస్తే రైతులు రాకపోకలు సాగించడానికి కాల్వకట్ట ఇరుకుగా మారుతుందని రైతులంటున్నారు. ఎన్నెస్పీ అధికారులు మేజర్ కాలువను సందర్శించి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని కాల్వకట్టను కాపాడి రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఎన్నెస్పీ అధికారులు వెంటనే స్పందించి కాల్వకట్ట ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాద్యత ఉంది.

# సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/దమ్మపేట:** సి పిఎం నాల్గవ రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరుగు మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ కోరారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్లను మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదల పక్షపాతి, పోరాటాల రథసారధి సిపిఎం పార్టీ అని, కేంద్రంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్నప్పటికీ రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కష్టజీవుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. పేద, మధ్య తరగతి ఆదాయాలు పెరగక, పెరుగుతున్న ధరలతో బ్రతుకులు రోజు రోజుకు బారం అవుతున్నాయి అని అన్నారు. సిపిఎం పార్టీ గెలుపు ఓటమి లతో సంబంధం లేకుండా సమస్యలు ప్రాతిపదికన కష్ట జీవులను ఏక్యం చేసి ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉంది అని అన్నారు. ఈ మహాసభలో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం జరిగిన ఉద్యమాల లోటు పాట్లను సమిక్షించుకొని రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలకు పదును పెట్టడానికి ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి. రాఘవులు, బృందకరత్, తమ్మినేని వీరభద్రం పాల్గొని దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కొలికిపోగు శ్రీనివాసరావు, నభి తదితరులు పాల్గొన్నారు.

# గడల సావిత్రమ్మకు సిపిఐ నివాళి





**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ నాయకుడు దివంగత గడల పెద్ద సూర్యనారాయణ సతీమణి గడల సావిత్రమ్మ (70) సిపిఐ సానుభూతి పరురాలు శనివారం మద్యాహ్నం మృతిచెందింది. ఆదివారం ఉదయం సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు సురేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పి గోర్కి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, తనికెళ్ల మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, పివిరావు, మేకల శ్రీనివాసరావు, ఎస్టీయు నాయకులు గడల భాస్కర్‌రావు, లేడిడోయిన గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, పెదమళ్ల రత్తమయ్య, గడల శ్రీనివాసరావు, యాసా రామ్మోహన్, పాపిట్ల ఏసు, గడల రామారావు, తొగరు గోపాల్‌రావు, లేడబోయిన నాగేశ్వరరావు, బాసా నాగరాజు, కట్ల సత్యం, బోనేపల్లి రాజనారాయణ, మృతురాలి కుమారులు గడల శ్రీనివాసరావు, క్రిష్టయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు మేలు జరగాలంటే

# మూడో ప్రత్యామ్నాయంగా బిఆర్‌టియు రావాలి




-ఒక్క అవకాశం ఇవ్వండి...కార్మికులను కాపాడుకుంటాం
-బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి పిఎస్‌పిడిలో కార్మికులకు మేలు జరగాలంటే మూడో ప్రత్యామ్నాయంగా బీఆర్‌టీయూ రావాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి అన్నారు. సారపాకలోని ఈస్ట్ గేట్ ఎదురుగా ఉన్న కార్యాలయంలో బీఆర్‌టీయూ, మిత్రపక్షాలు సీఐటీయూ, ఐఈయూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యూనియన్ల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 31న జరగనున్న ఐటిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బలమైన శక్తిగా బీఆర్‌టీయూ విజయం సాధిస్తుందన్నారు. గతంలో పని చేసిన టిఎన్‌టియూసి, ఐఎన్‌టియూసి కార్మిక సంఘాల వల్ల కార్మికులకు ఓరిగింది ఏమీలేదని, కార్మికులు కోరుకున్న వేతన ఒప్పందాలు కల్పించకుండా వారి హయాంలో కార్మికులను యాజమాన్యానికి తాకట్టు పెట్టాయని విమర్శించారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనీయలేదంటే వారు కార్మికుల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. ఆనాడు నాలుగు మిషన్లు ఉండగా 1575 మ్యాన్ పవర్ ఉండగా ఏడు మిషన్లు ఉన్నప్పుడు 1179కు మ్యాన్ పవర్ పడిపోయిందని, ఇలా అయితే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఎలా లభిస్తాయని ప్రశ్నించారు. ఓ కార్మికుడు వైద్యం చేయించుకోవాలంటే మెడికల్ స్కీం సరిపోవడం లేదని, కార్మికుల నుండి చందాలు వేసుకుని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి, దుస్థితి ఇప్పుడు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో రెండు సంఘాలు ఎన్నికల్లో గెలిచేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నాయని, కార్మికులు కోరుకున్న 14వ వేతన ఒప్పందంలో మంచి జరగాలంటే మూడో ప్రత్యామ్నాయంగా బీఆర్‌టీయూ మిత్రపక్షాలు రావాల్సిందేనన్నారు. ఇప్పుడు బీఆర్‌టీయూ మిత్రపక్షాలు గెలుస్తాయని ఆ రెండు సంఘాలు లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తుందని, ఎవరెన్ని కుయుక్తులు పన్నినా 31న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ మిత్రపక్షాలదే విజయమన్నారు. కార్మికులందరూ ఒక తాటిపైకి వచ్చి బీఆర్‌టీయూను గెలిపించాల్సిన అవసరం ఉందని, విజయం సాధిస్తే మేనిఫెస్టోలో పెట్టిన ఐదు ప్రధాన అంశాలను అమలు చేస్తామని కుటుంబానికి 100శాతం అన్ని రకాల వ్యాధులకు అన్‌లిమిటెడ్ మెడికల్, నాణ్యమైన విద్యను అందిస్తామని, సీనియారిటీ ప్రాతిపదికన ఎలాంటి షరతులు, ఖర్చు లేకుండా నిష్పక్షపాతంగా బదిలీలందరినీ పర్మినెంట్ చేయిస్తామని, టైం బ్రాండ్ ప్రమోషన్ పాలసీ తీసుకువస్తామని, ఈ3 గ్రేడ్ కలిగిన ప్రతి కార్మికునికి క్వార్టర్లు ఇప్పించి తీరుతామన్నారు. ఒక్క సారి అవకాశం ఇచ్చి బీఆర్‌టీయూ మిత్రపక్షాలను గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి షేక్ అజీమ్, మిత్రపక్షాల నాయకులు వెంకటేశ్వర్లు, షాబీర్, బ్రిటా సాయిబాబా, కేసుపాక నర్సింహారావు, మధు, ప్రశాంత్, గద్దల నాగేశ్వరరావు, బెజ్జంకి కనకాచారి, తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌కి అనూహ్య స్పందన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాల నందు ఆదివారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. మండలంలోని పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దాదాపు 160 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈసందర్భంగా కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ బిఎన్‌ఆర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. పబ్లిక్ పరీక్ష రాయబోవు విద్యార్థులకు మాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టులో ఇంకా ఎక్కువ పట్టు సాధించేలా ఈ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని తమ పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన ప్రతి స్కూల్ విద్యార్థులకు బహుమతులను రిపబ్లిక్ డే రోజు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగే కార్యక్రమములో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయబడును అని తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బట్టా వారి ఓణిల అలంకరణ వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఏ పాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని పోలవరం గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బట్టా విజయ్‌గాంధీ సోదరుడు బట్టా హరికృష్ణ, సుమిత్ర కుమార్తె మోక్షత ఓణిల అలంకరణ వేడుకల్లో ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించిన, నూతన వస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియోజకవర్గ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### మావోయిస్టు అగ్రనేత

# బడే చొక్కారావు మృతిపై కొనసాగుతున్న ఉత్కంఠ

**- భౌతికంగా ఉన్నట్లా..? లేనట్లా ?**
**- మృతిపై విడుదలైన లేఖపై వ్యక్తమవుతున్న పలు అనుమానాలు**
**- ఆ లేఖ ఎవరి సృష్టి ?**



**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టు అగ్రనేత, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, అలియాస్ దామోదర్ మృతిపై ఇంకా ఉత్కంఠత కొనసాగుతూనే ఉంది. దక్షిణబస్తర్ డివిజన్ కార్యదర్శి గంగా పేరిట శనివారం విడుదలైన లేఖ ఆధారంగా దామోదర్ మృతి చెందినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే ఆయన భౌతికంగా ఉన్నాడా ? లేదా ? అనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ పోలీసుల్లోనే కాకుండా విప్లవోధ్యమాభిమానులను కూడా ఈ ప్రశ్న తొలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పూజారాకాంకేర్ అడవుల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఈనెల 16వ తేది గురువారం భీకరపోరు సాగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు శుక్రవారం ఆ రాష్ట్ర పోలీసులు వివరాలు వెల్లడించారు. ఇంకా ఎక్కువ మందే చనిపోయారని, చాలా మంది గాయాలపాలయ్యారని వారిని మావోయిస్టులు అడవుల్లోనికి ఎత్తుకెళ్లారని ఆ రాష్ట్ర పోలీసులు అంచనా వేస్తున్నారు. ఎదురుకాల్పుల్లో చనిపోయింది 12 మంది కాదు 18 మంది అని మావోయిస్టు పార్టీ పేరిట విడుదలైన లేఖలో ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి చెందారని దక్షిణ బస్తర్ కార్యదర్శి గంగ పేరిట విడుదలైన హిందీ లేఖ చెబుతోంది. ఘటనా స్థలంలో చొక్కారావు ధైర్యసాహసాలతో పోరాడుతూ అమరుడైనట్లు ఆ ప్రకటనలో ఉంది. దామోదర్ మృతి పార్టీకి తీరని లోటని లేఖలో స్పష్టం చేశారు. దామోదర్ మృతి చెందాడనే వార్తతో ఆయన స్వగ్రామమైన కాల్వపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి. కాగా గంగ పేరుతో విడుదలైన లేఖపై అటు ఇంటిలిజెన్సీ పోలీస్ నిఘా వార్గాలు సైతం దీనిపై స్పష్టత ఇవ్వక పోగా, అటు తెలంగాణ రాష్ట్ర పోలీసులు సైతం దామోదర్ మృతి వార్తను ఇంత వరకు ధృవీకరించ లేదు. దీంతో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సజీవంగా ఉన్నట్లా, లేనట్లా అనేదానిపై స్పష్టత లేకపోగా భిన్నకథలు వెలుగులోనికి వస్తున్నాయి. పోలీసుల ధృష్టి మళ్లించేందుకే మావోయిస్టు పార్టీ ఈ తరహా ప్రకటన చేసిందా అనే ప్రశ్న తలెత్తుతోంది. పూజారి కాంకేర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా తప్పించుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. పోలీసుల ధృష్టి మరల్చేందుకే ఈ తరహా ప్రకటనలు మావోయిస్టు పార్టీయే చేసిందనే వాదను విశ్లేషకులు కొట్టిపారేయలేకపోతున్నప్పటికీ మాజీలు మాత్రం మరణ వార్తను ఒకింత విశ్వశిస్తున్నట్లు తెలుస్తోంది. ఎదురు కాల్పుల్లో దామోదర్ మృతి చెంది ఉంటే ఆయన బాడీని సహచరులు ఎత్తుకెళ్లి దహనం చేసి ఉండవచ్చని, లేదంటే గాయాలపాలైన ఆయనను తరలించే క్రమంలో మార్గమధ్యంలో ప్రాణాలు విడిచి ఉండవచ్చని, డెడ్‌బాడీ కనిపించకుండా పోలీసులు కూడా చెప్పలేరని అంటున్నట్లు తెలుస్తోంది. దామోదర్ మృతి పట్ల సిపిఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర స్పష్టత ఇస్తే తప్ప ఈ అనుమానాలకు తెరపడే అవకాశం లేదు.

## పోరాటాల ద్వారానే హక్కుల సాధన




**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాటాల ద్వారానే హక్కులు సాధించబడతాయని హక్కుల సాధన కోసం తపాలా ఉద్యోగులు పోరాటాలు చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు తెలిపారు. తపా లా ఉద్యోగుల సమావేశం ఆదివారం ఖమ్మంలో ఎడ్లపల్లి పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభలో జయరాజు మాట్లాడుతూ తపాలా ఉద్యోగులు కనీస సౌకర్యాలు లేకుండా నిత్యం పనిభారంతో సతమతమవుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆయన తెలిపారు. ఒకప్పుడు గౌరవంగా ఉండే పరిస్థితి నుంచి ఇప్పుడు వెట్టిచాకిరి చేసే పరిస్థితి ఏర్పడిందని జయరాజు తెలిపారు.కొన్ని హక్కులు సాధించామని మరికొన్ని హక్కులు సాధించాల్సి ఉందని జయరాజు తెలిపారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ అశాస్త్రీయ పని విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు అనివార్యమన్నారు. పోరాడేందుకు తపాలా ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మహ్మద్, రామారావు, వెంకటరెడ్డి, కె. మహేందర్, ఎఎ ఖాన్, బండి ఎల్లారావు, సుభాష్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా లెనిన్ శ్రీనివాస్, జి. శేషగిరిరావు, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, రామారావు, అధ్యక్షులుగా మౌలాలి, కార్యదర్శులుగా ఎండి ఖాజామోహినుద్దీన్, కోశాధికారిగా వి.మహేష్ ఎన్నికయ్యారు.

# ఎస్సి వర్గీకరణ కులాల సమస్య కాదు

**-అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందాలి**
**-రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎస్సి వర్గీకరణ రెండు కులాల మధ్య సమస్య కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. దీనిని మాల, మాదిగ సమస్యగా చూపి వర్గీకరణను వాయిదా వేయడం కాని రెండు కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం కాని చేయడం సరైంది కాదన్నారు. జాషువా సాహిత్య వేదిక స్పర్శ సామాజిక అధ్యయన వేదిక బిసి సంఘాల ఐక్య వేదిక తెలంగాణ పీపుల్స్ జేఏసి ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణ మేధావుల సంఘీభావ సదస్సు ఆదివారం మంచికంటి భవన్‌లో జరిగింది. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకులు ఐవి రమణారావు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణను చూపి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అట్టగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలన్న బిఆర్ అంబేద్కర్ ఆశయానికి అనుగుణంగా మాదిగలు, మాదిగ ఉప కులాలు రిజర్వేషన్‌ను దక్కించుకునేందుకు వర్గీకరణ అవసరమన్నారు. మాల, మాదిగలు రెండు అణగారిన వర్గాలేనని రమణారావు తెలిపారు. ఎస్సి వర్గీకరణకు సంబంధించి సదస్సులు, సమావేశాలకు పరిమితం కాకుండా ఒక కార్యాచరణ ప్రకటించి లక్ష్య సాధన దిశగా పయనించాలన్నారు. 40 సంవత్సరాల నుండి ఎస్సి వర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణ మాదిగను అభినందిస్తూ ఆయన పోరాటాలకు సంఘీభావం తెలిపారు. ఈ సదస్సులో ఎంఎల్‌సి తాతా మధు, కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, సిపిఎం నాయకులు ఎం. సుబ్బారావు, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, ఎన్డి నాయకులు ఆవునూరి మధు, ఆప్ నాయకులు ఎన్. తిరమల్, వివిధ సంఘాల నాయకులు కోటా రాంబాబు, మనోహర్‌రాజు, నాగమల్లేశ్వరరావు, గురుమూర్తి, శ్రీనివాసరావు, మంద కృష్ణ తదితరులు ప్రసంగించగా మేకల సుగుణారావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి విజయ్, నామ పురుషోత్తం, వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని పలు శుభకార్యాలలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఆదివారం కొత్తగంగారంలో కారం వారి వివాహవేడుకకు హాజరై నూతన దంపతులు ప్రవీణ్, నందినిలను ఆశీర్వదించారు. అనంతరం గండిప్రోలు గ్రామంలో ములకలపల్లి మాజీ ఎంపీపీ కుర్సం శాంతమ్మ మనవరాలు అస్మిత నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొని చిన్నారిని దీవించారు. అదే విధంగా జగన్నాథపురం గ్రామంలో ఎండి యూసఫ్ కుమార్తె నిఖా వేడుకలలో పాల్గొని శుభ ఆశీస్సులు అందించారు. ఈకార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, మాజీ జెడ్‌పిటిసి బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీకర్, అడపా నాగేశ్వరరావు, తిరుపతిరెడ్డి, సురభి రాజేష్, అనుమాల సత్యనారాయణ, పాలకుర్తి రత్న భూషణం, కొమిరాజు శ్రీనివాస్, వేముల రోశయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పాలకుర్తి రవి, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు గుంటూరు సాయి, అశ్వారావుపేట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పాలకుర్తి సుమిత్, ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సోయం నాగరాజు, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దొందూ దొందే..!

**-అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటే..**
**-విస్తుపోతున్న ప్రజలు**



**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** చట్టం, ధర్మం, న్యాయం పట్ల మాకు గౌరవం నమ్మకం ఉంది అంటూనే కోట్లు వెనకేసుకున్న కొందరు నేతలు అదే డబ్బుతో వాటిని శాసిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మస్తు డబ్బుంది, మరో వైపు పలుకుబడి ఉంది.. ఇంకేం అనే అహం నిలువునా పేరుకుపోయి ఉంది. కో అంటే కోటి మంది నిమిషాల్లో ముందుంటారన్న గర్వం వాళ్లలో రాజకీయ దర్పాన్ని తొలగించ లేదు. అందుకే ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు నాయకులు పలు సందర్భాల్లో ప్రజల ముందు ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం చూస్తుంటాం. అధికార దాహంతో వేల కోట్లు వెనకేసుకోవడం తప్ప ఎవ్వరూ ప్రజా సంక్షేమం కోసం చేసిందేమీ లేదు. ఈ నేపథ్యంలో ఒకాయన అంటాడు.. రెండు పార్టీలు ఒక్కటేనని, మరొకాయన అంటాడు మీరిద్దరూ ఒక్కటేనని, ఇంకొకాయన అంటాడు మీరంతా దొందూ దొందేనని ఇలా మూడు పార్టీల నేతలు ఎవరికి వారు నిందారోపణలు చేసుకుంటారు. మధ్యలో ప్రజలు వినే వాళ్ళు పిచ్చోళ్ళు వీళ్ల దృష్టిలో.. ఇంతకీ ప్రజలకు చేశారంటే అదీ లేదు. ఏడాదిలో లక్ష ఉద్యోగాలు ఇస్తాం అని హామీ ఇచ్చిఅధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తరు. కనీసం ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు కూడా ఎక్కడా ప్రస్తావించరు. మేం అధికారంలోకి వస్తే ఇన్ని గ్యారెంటీలు అమలు చేస్తామని ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంటుంది. అంతే ఇంకో పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూబెడుతుంది. ఇలా ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు చేరువైన దాఖలాలు లేవనే చెప్పాలి. అయినా వందల, వేల కోట్లు దోచుకున్న వాళ్ళు ప్రజాక్షేత్రంలో తమ రాజకీయ దర్పాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఇటువంటి నేతలపై తరచూ ఆరోపణలు, విమర్శలు చేసుకోవడం తప్ప వాళ్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మింగిన కోట్లాది సొమ్మును రికవరి ఎప్పుడు చేస్తారు..? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వల్ల ముందు ముందు ఎలా ఉంటుందో వేచి చడాల్సిందే.?

## సీతారాములుకు సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/పాల్వంచ:** తోగ్గూడెం గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ బాదావత్ శాంతి తండ్రి కేలోత్ సీతారాములు అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతి వార్త తెలుసుకొని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం వారి స్వగృహానికి వెళ్లి సీతారాములు భౌతికాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. వారిలో పాటు నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, రైతు సంఘం నాయకులు కోటి నాగేశ్వరరావు, సిపిఐ మండల నాయకులు జర్పుల మోహన్, సిపిఐ శాఖ కార్యదర్శి బాదావత్ శ్రీను, రైతు సంఘం శాఖ అధ్యక్షులు జరుపల బాలకృష్ణ, భాస్కర్, నాంచార్, రాజు, తదితరులు ఉన్నారు.